

# అంకురార్పణ

- ప్రవీణ మోణంగి

ఈ సృష్టి ఎంతో అద్భుతమైనది ... పశుపక్ష్యాదులు .. జీవనదులు ... పంచభూతములు ... సూర్యచంద్రులు ... వీటన్నింటి మధ్య మానవులు. ఇది ఇంకా అద్భుతము కదూ! ఆ భగవంతుడు సృష్టించిన మానవులలో ఆడ, మగ ఇది ఎంతో అపురూపము. ఆదేవుడు ఇరువురికీ సమానమైన హక్కులు, శక్తి సామర్థ్యాలు ఇచ్చాడు. అయితే తాను సృష్టించిన ఈ అందమైన లోకము కొనసాగాలంటే ఆడ, మగ మధ్య ఆకర్షణ ఉండాలి. కనుక అమ్మాయికి అందాన్ని ఆభరణముగా ఇచ్చి, ఆమెను అతివను చేశాడు. అబ్బాయికి శరీర ధారుడ్యాన్ని, శక్తినీ, సంతాన సామర్థ్యాన్ని ఇచ్చి, మగవాడిగా చేశాడు. అతివకు ఇంటిని చక్క దిద్ది, పిల్లలను కనే వరాన్ని ప్రసాదించి, ఇల్లాలిని, 'అమ్మ' ని చేశాడు. అబ్బాయికి కుటుంబాన్ని పోషించే శక్తిని ప్రసాదించి, ఇంటి యజమానిగా, 'నాన్న'గా మలిచాడు. ఈవిధముగా అతడు..ఆమెను సంసారము అనే బంధం లో బంధించి, అమ్మా-నాన్న, కొడుకు - కోడలు, కూతురు - అల్లుడు, తాతా - బామ్మ ఇలా అందమైన బంధుత్వాలను ఏర్పరచి .. ఆడ, మగ మధ్య ఎటువంటి తారతమ్యాలు, పక్షపాతము లేకుండా ఈ సృష్టిని ఆ భగవంతుడు కొనసాగిస్తున్నాడు.

అయితే కాలానుగుణంగా మనిషి జీవన పథంలో ఎన్నో మార్పులు చోటుచేసుకొని నేటి పరిస్థితి ఇందుకు భిన్నముగా ఉన్నది. మగవాళ్ళతో మాకూ సమాన హక్కులు కావాలి అని మహిళలు పోరాటాలు చేస్తున్నారు. ఆ భగవంతుడే మనకి సమానమైన హక్కులు ప్రసాదించినపుడు ఇంక ప్రత్యేకమైన పోరాటము ఎందుకు? ఒక ప్రక్క మేము మగవాళ్ళతో ఎందులోనూ తీసిపోము అని అన్ని వర్గాలలోను దూసుకు పోతున్న మహిళలు.. మరో ప్రక్క మగవారి చేతిలో బలి అయిపోతున్న అమ్మాయిలు.. ఎటువైపు పయనిస్తుంది మన వ్యవస్థ? భర్త చేతిలో బాధింపబడుతున్న భార్య.. భార్యా బాధితుడిగా నమోదవుతున్న భర్త.. అత్యాచారానికి గురియవుతున్న అమ్మాయిలు...అత్తని సాధిస్తున్న కోడలు...కోడల్ని రాచిరంపాన పెడుతున్న అత్త...ఇలా ఎన్నో అరాచకాలను వింటున్నాము..చూస్తున్నాము...దేశం నలుమూలలా ఎన్నో

www.sirimalle.com

అనర్ధాలు జరుగుతున్నాయి. అసలు వ్యవస్థ ఎందుకు ఇలా తయారు అయ్యింది? ఏనాడయినా ఆలోచించారా? అసలు ఈ సమస్యకి మూలము కనుగొన్నారా ఎవరైనా?

తల్లి గర్భములో బీజానికి అంకురార్పణ జరిగినపుడు ఆబిడ్డ ఈ లోకములోకి వచ్చినపుడు ఆ భగవంతుని సృష్టి అందరి పిల్లలలో ఒకేలా ఉంటుంది. కానీ ఆ బిడ్డ పెరిగే వాతావరణములోనే కీలకమైన మార్పులు చోటు చేసుకుంటున్నాయి. బిడ్డ పుట్టినప్పటినుండి తల్లీ తండ్రీ వాళ్ళకి సరైన నడవడిక నేర్పితే ఈ సమస్య రాదు. ఎందుకు కొంత మంది పిల్లలు సంస్కారవంతులుగా, కొందరు ఆకతాయిలుగా, మరికొందరు నేరస్తులుగా తయారవుతున్నారు? నేను ఇక్కడ తల్లితండ్రులను తప్పుబట్టడములేదు కానీ, ప్రతి తల్లీ, తండ్రీ ఎంతో బాధ్యతతో తమ పిల్లలను పెంచాలి, మంచి నడవడికను నేర్పాలి. ఎంతో ఓర్పుగా వాళ్ళను మంచి పౌరులుగా తీర్చిదిద్దితే నేడు దేశములో ఇన్ని అనర్ధాలు ఎందుకు జరుగుతాయి? ఒక ధనవంతుడైన తండ్రి తన బిడ్డలకు కష్టము, సుఖము అన్నీ తెలిసేటట్లు పెంచాలి. అలా కాకుండా గారాబముగా ఏ కష్టము తెలియకుండా పెంచితే జీవితములో ఎదురయ్యే కష్టాలను, సమస్యలను ఎదుర్కొనలేక ఇబ్బంది పడతారు, నలుగురిని కూడా ఇబ్బంది పెడతారు. తల్లిగా అమ్మాయికి అన్ని అణుకువలు, మెళకువలు నేర్పాలి. అలాగే అబ్బాయికి కూడా అన్ని సంసార బాధ్యతలు తెలియచెప్పాలి లేదంటే సంసార సాగరములో పయనించలేక వారి జీవితాలు అస్తవ్యస్తంగా తయారవుతాయి.

పూర్వం గురువే దైవము..యుక్త వయస్సు వచ్చే వరకు అంటే 14 సంవత్సరములు పిల్లలు గురువు వద్దనే ఉండి విద్యాభ్యాసంతో పాటు జీవితానికి కావలిసిన అన్నింటినీ గురువు వద్ద అభ్యసించేవారు...కానీ నేడు తల్లితండ్రుల గారాల పట్టీగా మారి కష్టసుఖాలు తెలుసుకోకుండా ఎదుగుతున్నారు. ..అయితే వెనుకటి కాలాన్ని మరలా తీసుకురాగలమా? అసాధ్యము...కానీ, ప్రతి తల్లీతండ్రీ తమ బిడ్డలు అన్నింటిలోనూ అందరికన్నా ముందుండాలనే కోరిక స్థానములో తమ బిడ్డలు మంచి పౌరులుగా..ఉన్నతమైన ఆదర్శాలతో నిజాయితీ భావాలు కల వ్యక్తులుగా ఎదగాలనే సంకల్పము ఉన్న రోజు ఈ దేశము సస్యశ్యామలమవుతుంది.

www.sirimalle.com

రాజుల కాలము పోయి..ఉమ్మడి కుటుంబాలు పోయి..నేడు అన్నీ ఒంటరి కాపురాలు మిగిలాయి...బంధాలు బాంధవ్యాలు వాటి విలువ.. పురాణాలు ఇతిహాసాలు తదితర అంశాల గురించి అవగాహన కనుమరుగయిపోతోంది... ఇక పిల్లలకు భోదించేది ఎవరు? ఉన్న ఆ ఒకరిద్దరి పిల్లలను కూడా విధిలేకో గతిలేకో హాస్టళ్లలో ఉంచి చదివిస్తున్నాము ...ఉన్నత చదువులకి విదేశాలకు పంపుతున్నాము...ఇక ఆ పిల్లలు తల్లితండ్రి ఉండి కూడా అనాధలలాగా జీవిస్తున్నారు...పిల్లలకి బంధాలు ఆప్యాతల గురించి ఎవరు నేర్పుతారు? చెల్లి,అక్క,అన్న, తమ్ముడు ఈ బంధాలలో ఉండే మాధుర్యాన్ని వాళ్ళ నుండి మనమే దూరము చేస్తున్నాము.

ఇక గురువు పాత్ర. విధార్థికి.. తల్లీతండ్రీ తరువాత పాఠశాలలో గురువే ప్రధాన పాత్ర..కానీ, నేటి విద్యా విధానములో గురుశిష్య బంధము కనుమరుగయిపోతున్నది. ఎన్నో ఉన్నత అంశాలను భోదించవలసిన గురువులు ఈ పోటీ ప్రపంచములో పుస్తకాలలో ఉన్న పాఠ్యాంశాలని భట్టీ పట్టించి ఎక్కువ మార్కులను సంపాదించడము పైనే దృష్టిని నెలకొల్పే పరిస్థితిని ఎదుర్కుంటున్నారు...చాలా మంది ఉపాధ్యాయులు తమ విద్యార్థులకు ఎన్నో మంచి విషయాలను బోధించాలనే కోరిక ఉన్నా ...నేటి విద్యావిధాన పరిస్థితుల వలన వాళ్ళకి ఆ అవకాశము లభించడము లేదు...నేటి విద్యావ్యవస్థ లో మార్పును తీసుకురావాలి...బోధనా విధానములో మార్పు అనివార్యము.

కొంతమంది విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లితండ్రులు, మేము అన్నీ అవలంభిస్తున్నాము అని అనవచ్చు... నేను కాదనడము లేదు... అయితే కొంతమంది...కొన్ని చోట్ల మార్పు వస్తే సరిపోదు...వ్యవస్థ మొత్తములో మార్పు రావాలి....దానికి అంకురార్పణ మనమే చేయాలి..

## పిల్లల పర్యవేక్షణ

పెరుగుతున్న ధరల కారణముగానో...ఆర్థిక పరిస్థితులవలనో...విలాసవంతమైన జీవితాన్ని గడపడానికో.. కారణము ఏదయినా కావచ్చు కానీ, నేడు భార్య భర్త ఇద్దరూ సంపాదించవలసిన పరిస్థితి నెలకొంటున్నది.. మరి పిల్లల ఆలనా పాలనా ఆయాల వశమవుతున్న తరుణములో.. పిల్లల నడవడికలో మార్పులు చోటుచేసుకుంటున్నాయి..ముక్కుపచ్చలారని ఆ చిన్నారులు చేసిన నేరమేమి?.. ఆ వయస్సులో వాళ్ళు

www.sirimalle.com

తల్లిదండ్రుల నుండి పొందవలసిన అనురాగ ఆప్యాయత అనే మమకారపు లాలిత్యాన్ని దూరము చేసేస్తున్నాము..అమ్మ ఒడిలో ఉండే కమ్మదనము ఆయాల వద్ద...డే కేర్ సెంటర్ లలో ఉంటుందా? ఆయాల చేతిలో అగచాట్లు పడుతున్న పసివాళ్ళ గురించి ఎన్నో వింటున్నాము..అయినా గత్యంతరము లేక వారివద్దే పిల్లలను వదిలేస్తున్నాము...ఈ మధ్య నా స్నేహితురాలి ఇంటిలో జరిగిన సంఘటన నా హృదయాన్ని కలిచివేసింది...నా స్నేహితురాలు తన రెండేళ్ల బిడ్డని గతి లేక ఆయా చేతిలో పెట్టి ఉద్యోగానికి వెళ్లింది. వెళ్ళిన రెండు గంటలకే ఇంటి వద్దనుండి కాల్ వచ్చింది..పరుగుపరుగున ఇంటికి వచ్చిన తనకు, లేత పాదములు రెండు ఎర్రగా బొబ్బలతో...మంటకి తాళలేక విలవిలలాడుతున్న తన రెండేళ్ల చిన్నారి ఎదురయ్యాడు...ఇంక ఆతల్లి మనస్సు ఎంత విలవిలలాడి ఉంటుందో మీకు ఈపాటికే విశదమైవుంటుంది. ఇంతకీ జరిగినది ఏమిటంటే...బాబుకి స్నానం చేయించడానికి ఆ ఆయా బాబుని బాత్రూమ్ వద్ద పెట్టి...బాబుకి స్నానం చేయించే టబ్ లో సలసల కాగుతున్న వేడి నీటిని పోసి...చల్లటి నీటిని అందులో పోయడము మరిచి..ఈ లోపున ఏదో మరిచిపోయిన కారణముగా వంటగదిలోకి వెళ్లింది..అదే సమయములో బాబు రోజూ తను స్నానము చేసే టబ్ ని చూడగానే సరదాగా...(అందులో వేడి నీళ్లు ఉన్నట్లు తెలియదు కదా) కాలు పెట్టి అందులోకి దిగాడు...పాపం వేడి తట్టుకోలేక అమ్మా! అని గట్టిగా అరిచాడు. వంట గదిలోకి వెళ్ళి బాబు విషయం మరిచిపోయిన ఆయా బాబు కేక విని పరుగెత్తుకుని వచ్చి...బాబుని టబ్బు నుండి బయటకు తీసినా అప్పటికే జరగవలసిన అనర్ధము జరిగిపోయింది. బాబు రెండు లేత పాదములు ఎర్రగా కాలిపోయి బొబ్బలు కూడా వచ్చాయి...ఇందులో బాబు తప్పేముంది! ఆయా నిర్లక్ష్యం వలన...పసివాడు బాధపడ్డాడు... ఇక బాబు పూర్తిగా కోలుకోవడానికి రెండు నెలలు సమయం పట్టింది..ఇటువంటివి ఎన్నో జరుగుతుంటాయి...

ఇక్కడ ఎవరినీ తప్పు పట్టడం నా ఉద్దేశ్యం కాదు...కానీ ఆయాలకి ప్రత్యామ్నాయము ఆలోచించాలి..ఇంటిలో ఇదివరకు పెద్దవాళ్ళు ఉండి అన్నీ చూసుకునే వారు...ఇప్పుడు ఒంటరి కాపురాలు అయిపోయి చెట్టుకొకరు పుట్టకొకరు అనే తీరులో వున్నాయి అందరి బ్రతుకులు..మన అమ్మానాన్నలనో..అత్తామామలనో మన వద్దే ఉంచుకుంటే...మనకి ఒక పెద్దదిక్కు ఉంటుంది... పిల్లలకు నాన్నమ్మ ..అమ్మమ్మ ..తాత్యయ్య ల ముచ్చట తీరుతుంది...పెద్దవాళ్ళకి పిల్లలున్నారనే ఆనందము దక్కుతుంది..ఇప్పుడున్న పరిస్థితులలో...పెద్దలకీ, పిల్లలకీ కొంచెం మనస్పర్ధలు వస్తాయి.. సర్దుబాటు కష్టమే...నేను కాదనను..కానీ ఒక్క విషయం ఆలోచించాలి మనం. చిన్న చిన్న త్యాగాలు.. సర్దుబాట్లు చేసుకుంటే.. అది మన పిల్లల భవిష్యత్తుకి బంగారు బాట అవుతుంది. పెద్ద వాళ్ళ అనుభవాలు పిల్లల ప్రగతికి సోపానాలు. ఆ **అంకురార్పణ** మనతోనే జరగాలి. రండి అందరం కలిసి నూతన పథానికి నాంది పలుకుదాం.

# అంతర్జాలం

ఇది ఒక మాయాజాలం..నేడు దీనికి అందరూ బానిసలయిపోతున్నారు. అవసరార్ధ వాడకము తప్పు లేదు..కానీ అవసరానికి మించి వాడితేనే ముప్పు వాటిల్లితుంది. చిన్న వాళ్ళ నుండి ముసలి వాళ్ళ వరకు..ప్రతి ఒక్కరి చేతిలో నేడు సెల్ ఫోన్ ధర్శన మిస్తున్నది. టాబ్లెట్ ..ఐఫోన్లు..మొబైల్ ఫోన్లు..ల్యాప్టాప్లు ఇలా ఒకటేమిటి అన్నింటికీ వినియోగము ఎక్కువైపోయింది నేడు. ఒకప్పుడు మొబైల్ ఉంటే గొప్పగా చెప్పుకునేవారు. కానీ నేడు స్మార్ట్ ఫోన్ లేదంటే అవమానిస్తున్నారు. అవమానముగా భావిస్తున్నారు. పరిస్థితి అలా మారిపోయింది. ఉచిత కనెక్షన్లు...ఉచిత డేటాలు ఎరచూపి మిగిలిన ఆ కాస్త జనాన్ని కూడా అంతర్జాలానికి బానిసలను చేశాయి కొన్ని కంపెనీలు. పిల్లలు మొబైల్ లలో ఎంతో ఏకాగ్రతతో ఆటలు ఆడేస్తూ దృష్టి లోపాలను కొని తెచ్చుకుంటున్నారు. చదువులపై..బయట ఆటలపై అనాసక్తిని చూపిస్తున్నారు. అరె చిన్న పిల్లవాడు మొబైల్ చేతికిస్తేనే అన్నం తింటున్నాడు. మొన్న మా బంధువుల వాళ్ళింటికి వెళ్ళినపుడు. ఆ పిల్లవాడి వయస్సు నాలుగేండ్లు...వాడు యు ట్యూబు బ్రౌజ్ చేస్తున్నాడు. అందులో ఉండే అసభ్యకర చిత్రాలను తిలకిస్తున్నాడు వాడికి తెలియకుండానే. ఇందులో తప్పు ఎవరిది..? ఇంకో ఇంటిలో అర్థరాత్రయినా అబ్బాయి వైఫై వాడుతున్నాడు. అదేమిటని అడిగితే.. అబ్బాయే కదా! భయమెందుకు.. అంటున్నారు. ఏమి అబ్బాయి మాత్రం చెడిపోడా..? మన ఆలోచనలలో ఎంత వ్యత్యాసం!.. ఎటుపోతున్నది మన సమాజం.. ఒక ప్రక్క అన్ని విషయాలలో ఎంతో పురోగతిని సాధిస్తూ.. ఇంకో ప్రక్క ఇలా వెనక పడిపోతున్నాము.. చిన్న పిల్లలనే కాదు.. పెద్దవాళ్ళు కూడా ఈ వాట్స్ ఆప్, ఫేస్ బుక్ ల వలన ఇబ్బందులు పడుతున్నారు.. భార్యా భర్తల మధ్య అనురాగం కరువయిపోతున్నది.. కుటుంభ సభ్యుల మధ్య మమకారాలు దూరమయిపోతున్నాయి.. ఎందుకు జరుగుతుంది ఇలా?? ఎందుకంటే నేటి జీవన విధానము యాంత్రికమైపోయింది.. తల్లితండ్రులు వాళ్ళ ఉరుకుల పరుగుల పయనములో తమ పిల్లలతో గడిపే సమయాన్ని తగ్గించేశారు... ఇద్దరి పిల్లల స్థానాన ఒక్కరినే కంటున్నారు.. ఇంక వాళ్ళ మనసులో మాటలను పంచుకోవడానికి ఎవరూ లేక అందుబాటులో ఉన్న అంతర్జాలానికి బానిసలయిపోతున్నారు.. మరి ఏమీ చేయాలేమా! ఎందుకు చేయలేము! చిన్న చిన్న మార్పులు చేస్తే తప్పకుండా సాధ్యమవుతుంది. పిల్లలు అంతర్జాలాన్ని మన సమక్షములో వాడేటట్లు చూసుకోవాలి. రాత్రి పూట మొబైల్ ఫోన్లను వాళ్ళ వద్ద ఉంచకూడదు.. అలాగే భోజనము చేసేటప్పుడు కుటుంబంలో అందరూ కలిసి డైనింగ్ టేబుల్ వద్ద.. మొబైల్ ఫోన్లను దూరముగా పెట్టి పిల్లలతో మాట్లాడుతూ తిందాము. అప్పుడు వాళ్ళు ఒంటరి తనము భావించకుండా మనసులో ఉన్నవి మనతో చెప్పుకుంటారు. మనము కూడా అవసరానికి మించి మొబైల్ వాడకము తగ్గిస్తే

అందరితో గడిపే సమయము లభిస్తుంది. దీనికి అంకురార్పణ మనమే చేయాలి. ఎవరో వచ్చి ఏదో చేస్తారని ఎదురుచూడకూడదు.

## మాదక ద్రవ్యాలు

మనుషుల మతులు పోగొట్టి...శరీర అవయవాలను కృశింపజేసి...ఎముకలను పిండి చేస్తూ ..రక్తాన్ని నీరుగార్చే ..వినాసిని ఈ మాదక ద్రవ్యం, నేడు యువతని పట్టిపీడిస్తున్న మహమ్మారి. ఈ మాదకద్రవ్యాల వ్యాపారం చివరకు సినీ పరిశ్రమలో కూడా ఒక భూకంపాన్ని తెచ్చింది...ఈ మత్తులో చిత్తవుతున్న వారెందరో..అభం శుభం తెలియని చిన్నారుల నుండి అన్నీ తెలిసిన నవతరం వరకు అందరూ మత్తుకు చిత్తవుతున్నారు...మరి దీనికి కారణమేమిటి...కారకులెవరు...? ఈ మత్తులోపడి మిగిలిన జీవితాన్ని అంధకారములోకి నెడుతూ ఎంతో విలువైన మానవ జీవితాన్ని చిత్తు చేసుకుంటున్నారు...దీనికి బాధ్యులెవరు?

ఒకరు లేక ఇద్దరు పిల్లలని కని...వాళ్ళని అతిగారాబముగా పెంచుతూ... అడిగినవన్నీ కాళ్ల దగ్గరకు తెచ్చిపెడుతూ.. అడిగినంత డబ్బులిస్తూ...ఆ డబ్బులు సంపాదించడానికి తల్లితండ్రులుగా రాత్రీ పగలు కష్టపడుతూ...పిల్లలు ఎలా పెరుగుతున్నారో పట్టించుకోకుండా...వాళ్ళ ఆలనా పాలనా చూసే తీరిక లేక..అటు మంచిని భోదించే నాన్నమ్మ తాతయ్యలు వంటి పెద్దల సంరక్షణ కొరవడుతూ...మనసులో భావాల్ని పంచుకునే సన్నిహితులు లేక...ఈ వ్యసనానికి బలి అవుతున్నారు నేటి యువత...ప్రేమ రాహిత్యముతో కొంతమంది...చదువులలో పోటీతత్వాన్ని తట్టుకోలేక కొంత మంది...అంతర్జాల బెదిరింపులకి తలవగ్గి కొంతమంది...బెట్టింగులలో ధనమును పోగొట్టుకుని కొంతమంది...కొత్త రుచుల సరదా పందాలో కొంతమంది... మానసిక ఒత్తిడికి తట్టుకోలేక కొంత మంది...మనసు బలహీనమైన క్షణాన ఈ మాదక ద్రవ్యాలకు బానిసలైపోతున్నారు... ఈ మత్తులోకి దిగినవారందరూ...దీనికి బానిసలై బయటకు రాలేక...వాటిని కొనడానికి డబ్బులు లేక..అవిలేకపోతే ఉండలేక..తప్పుల మీద తప్పులు చేస్తూ...తమ జీవితాన్ని నాశనము చేసుకుంటున్నారు..

ఈ మత్తు నుండి బయటపడాలంటే...తల్లితండ్రులకు చాలా ఓపిక ఉండాలి...ఏ ప్రేమ రాహిత్యముతో వాళ్ళు దీనికి బానిసలయ్యారో ..ఆ ప్రేమనే మందుగా పెట్టి తమ బిడ్డలను మార్చుకోవాలి...జీవితపు విలువలను... మాధుర్యాన్ని వాళ్ళకి చవిచూపాలి. ఎంత పనుల ఒత్తిడి ఉన్నా పిల్లల స్కూల్ కి..కాలేజీలకి వెళ్ళి...అక్కడి వాతావరణాన్ని, పరిస్థితులను, గమనించి అధ్యాపకులతో పిల్లల గురించి

చర్చించాలి...బంధాలు...అనుబంధాల విలువలను ఇప్పటి పిల్లలకు తెలియజెప్పాలి...దీనికి అంకురార్పణ మనమే చేయాలి...

# వివాహ వ్యవస్థ

నేటి తరం అమ్మాయి/అబ్బాయి పెళ్లి అంటేనే భయపడిపోతున్నారు. ఆ బంధానికి కట్టుబడి.. బాధ్యతలను స్వీకరించడానికి ఎవరూ సిద్ధంగా ఉండడము లేదు.. ఒక వేళ వివాహం చేసుకున్నా చీటికీ మాటికీ గొడవలు పడుతూ విడిపోతున్నారు.. పెళ్లి పేరు చెబితేనే మేము ఇంకా బాగా డబ్బులు సంపాదించి జీవితములో సెటిల్ అవ్వాలి.. అప్పుడే చేసుకోము అని తప్పించుకుని తిరుగుతున్నారు.. కొంత మంది ప్రేమ పెళ్లిళ్లు చేసుకుంటున్నారు.. మరికొందరు ప్రేమలో విఫలులై బార్లలో తిరుగుతున్నారు.. ఇంకొందరు లివింగ్ టుగెదర్ అంటూ పెళ్లికాకుండానే సహజీవనం సాగిస్తున్నారు.. మరికొందరు ప్రేమ ఒకరితో.. పెళ్లి ఇంకొకరితో అంటూ వింత పైఖరి చూపిస్తున్నారు.. అయిదు రోజుల పెళ్లిసందడి పోయి చేవ్రాలు చేసుకునే పెళ్లిళ్లు వచ్చాయి.. ఇప్పుడు అవీ పోయి పెళ్లి చేసుకోము కలిసి ఉంటాము అంటున్నారు... ఏమయినా అర్థం ఉందా? ఇందులో... ఈ పరిస్థితిని చూసిన ఎవరికైనా మన వివాహవ్యవస్థ, సంప్రదాయం అంతా సమసిపోతుందనే భయం పట్టుకుంటున్నది.

ఈ మధ్య నాకు బంధువుల అబ్బాయి తారసపడ్డాడు.. వాడి వయస్సు ముప్పై ఉంటుంది.. ఏమిరా! ఇంకా పెళ్లి చేసుకోవా? అని అడిగా ..దానికి ‘అమ్మో’ అని బదులు ఇచ్చాడు.. నేను ఏమి, ఎందుకు అని అడిగితే... అక్కా! ఈ కాలం అమ్మాయిలను చూస్తుంటే భయం వేస్తుంది.. వాళ్ళ అలవాట్లు.. వేషధారణ... వాళ్ళ వేగము.. ఎదిరించి మాట్లాడటము.. ప్రతీ విషయానికి గొడవపడటము.. అమ్మో! నా వల్ల కాదు ...నీలాగా..మా అమ్మ లాగా ఉండే ఒక్క అమ్మాయిని చూపించు .. కళ్లుమూసుకుని తాళి కట్టేస్తా అన్నాడు.. ఇంకా అవాక్కవడము నా వంతయ్యింది..

నిన్ననే మా అత్త కూతురుని కలిసాను.. తనకీ ఇరవై ఎనిమిది ఏండ్ల వయస్సు.. ఇంకా పెళ్లి చేసుకోలేదు.. ఏమి! ఇంకా పెళ్లి చేసుకోవా? అని అడిగితే నా స్వేచ్ఛ పోతుంది అంది.. అవునా! అన్నాను. అవును అక్కా! ఇప్పుడు ఉండేటట్లు పెళ్లి అయ్యాక ఉండలేము.. పెళ్లి అయ్యాక ప్రతీదీ సర్దుకు పోవాలి.. అన్నింటికీ అనుమతి తీసుకోవాలి.. సంజాయిషీలు చెప్పుకోవాలి.. స్వతంత్రత ఉండదు అని అంటుంది.. మరి ఎప్పటికీ చేసుకోవా అని అడిగితే జీవితం కొంత అనుభవించనీ అని అంటూ వెళ్లిపోయింది.. ఇదండీ పరిస్థితి... ఇంకా కొంతమంది పెళ్ళికి ముందు ప్రేమించడం.. వేరొకరిని పెళ్లి చేసుకోవడం.. పెళ్లి అయిన తరువాత విషయము

www.sirimalle.com

బయటపడేసరికి ఇద్దరి మధ్యన గొడవలు.. చిలికి చిలికి గాలివానగా మారి విడాకుల వరకు వెళ్ళడం.. రివాజుగా మారిపోయింది.. మరికొంతమంది ఇంకొంచెం ముందుకు వెళ్లి హింసాత్మక ధోరణిలో ప్రాణాలు తీయడానికి కూడా వెనుకాడుటలేదు… మరి ఈ వ్యవస్థ లో మార్పు తీసుకురాలేమా!

మనసుంటే మార్గముంటుంది… సమస్య ఉన్న చోటే పరిష్కారముంటుంది.. ఇంతవరకు నేను చెబుతున్నదే మళ్ళీ మళ్ళీ మీకు చెబుతున్నట్లుగా అనిపించవచ్చు.. కానీ అదే పరిష్కారం..జీవితం యొక్క విలువలను పిల్లలకు నేర్పించాలి. కుటుంబంలో అందరిమధ్యన ముఖ్యంగా పిల్లల మధ్య ఒక స్నేహపూర్వక అనుబంధాన్ని కలుగజేయాలి.. పెద్దల మాట చద్దన్నం మూట అని బోధించాలి.. పెద్దవాళ్ళ అనుభవాలు పిల్లలకి ఎంతో అవసరం.. తల్లి, కూతురికి.. తండ్రి కొడుకుకు… వివాహం గురించి ..భార్యాభర్తల బంధం గురించి ..విలువల గురించి.. ఆ అనుబంధం లో ఉండే మాధుర్యం గురించి వివరించాలి.. ఓపిక.. సహనము నేర్పించాలి. చిన్న వయసులోనే డబ్బు సంపాదన మీద పెరుగుతున్న వ్యామోహం తగ్గించాలి.. సంపాదనకు, సుఖమయ జీవితానికి సంబంధం లేదనే విషయాన్ని తెలియజెప్పాలి. ఇది కొంచెం కష్టమైన పనే అయినా తప్పదు.. అలనాటి అయిదు రోజుల పెళ్లి వైభవాన్ని మళ్ళీ తీసుకు రావాలి.. ఈ కార్యానికి మనమే అంకురార్పణ చెయ్యాలి…

## క్షణికావేశం

ఇది చాలా ప్రమాదకర ఆవేశం..క్షణం లో ఉద్భవించే కోపముతో..క్షణ కాలం లో నిర్ణయం తీసుకుని.. క్షణం లో బలవన్మరణానికి పాల్పడుతున్నారు…చిన్న వాళ్ళు మొదలుకుని ముసలివాళ్ల వఱకు…రకరకాల కారణాల వలన ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు…అమ్మ కొట్టిందని ఒకరు…మాస్టారు దండించారు అని ఇంకొకరు.. ప్రియురాలు మోసగించిందని ప్రియుడు..పంటలు పండలేదని రైతు…భార్యతో వేగలేక భర్త…చదువుల ఒత్తిడి, ర్యాంక్ ల పోటీని తట్టుకోలేక విద్యార్థి…పిల్లలు ఆదరించలేదని ముసలి తల్లితండ్రులు…ఇలా చెప్పుకుంటూపోతే ..ఎంతమందో బలవన్మరణానికి పాలుపడుతున్నారు…ఆరు నెలల క్రితం మా పిన్ని వాళ్ళ అమ్మాయి ఆత్మహత్య చేసుకుంది..మా పిన్ని, వాళ్ళమ్మాయిని గారాబముగా పెంచింది..ఇంజనీరింగ్ చదువుతున్నపుడు ఒక అబ్బాయిని ప్రేమించానని చెప్పింది..అబ్బాయి ఒక జల్సారాయుడని తెలిసి మా పిన్ని -బాబాయి పెళ్ళికి నిరాకరించారు. ఆ అబ్బాయి ఇంటికి వచ్చి గొడవ చేయడముతో..మా పిన్ని వాళ్ళమ్మాయిని 'ఇలాంటివన్నీ నీవలనే జరుగుతున్నాయి. అతను ఇప్పుడు గొడవపడుతూ మన ఇంటివరకు వచ్చాడు' అని రెండు మాటలు కోపముగా అన్నది. అంతే ఆ మాటలకే వాళ్ళమ్మాయి మనస్థాపము చెంది..ఉరి వేసుకుని

www.sirimalle.com

చనిపోయింది..మా పిన్ని బాబాయిలకు పుట్టెడు శోకం మిగిల్చి వెళ్లిపోయింది..ఈ విషయం నన్ను బాగా కదిలించింది...అందుకే మీతో ఇలా పంచుకుంటున్నాను...ప్రాణం తీసుకోవడం అంతా సులభమా? మనకి ఇంత మంచి మానవ జన్మ వచ్చినందుకు ఎంతో సంతోషించాలి..అన్నిటికన్నా ఉత్తమమైన జన్మ ఇచ్చినందుకు ఆ భగవంతునికి కృతజ్ఞతలు తెలుపుకోవాలి..చిన్న చిన్న కారణాలకు ప్రాణాలు తీసుకోకూడదు...ఎవరి జీవితమూ పూల బాట కాదు..కానీ, మనమే మన జీవితాన్ని అందముగా మలుచుకోవాలి. అందుకు కొంత సమయము పడుతుంది అంతే ..సహనము వహించాలి...కానీ నేటి తరానికి ఆ ఓపిక, సహనము కొఱవడుతున్నాయి...జీవితము అంటే వడ్డించిన విస్తరిలా ఉండాలి అనే అభిప్రాయములో ఉన్నారు... ఏదికోరితే అది నిమిషాలలో ఇచ్చే మనలాంటి తల్లితండ్రులు ఉన్నంతవరకు వాళ్ళ ప్రవర్తన అలాగే ఉంటుంది. అదే అలవాటుతో వాళ్ళు కోరినవన్నీ వెంటనే దక్కాలి అనే వెర్రి ఆలోచనలో ఉన్నారు...జీవితము ఎంత విలువైనదో...మనం చిన్నప్పుడు ఎదుర్కొన్న సంఘటనలను పిల్లలకు చిన్నప్పటి నుండే వివరించి.. జీవితములో వచ్చే కష్టాలను ఎలా ఎదుర్కోవాలి? సమస్యలను ఎలా పరిష్కరించుకోవాలి? ...తదితర అంశాలను వివరిస్తూ వాళ్ళని మానసికముగా అన్నింటికీ సంసిద్ధులను చేయాలి...ఈ భూమి మీద మానవ జన్మ ఎత్తిన ప్రతి ఒక్కరిని ఆ భగవంతుడు ఒక ఉద్దేశ్యపూర్వకముగా పంపించాడు...కానీ కొంతమంది మాత్రమే సమాజ శ్రేయస్సుకు పాటుపడి తమ జన్మ సార్థకము చేసుకుంటున్నారు. నేను కూడా చాలా రోజులు అసంతృప్తి గా ఉండేదాన్ని..జీవితం నిస్సారముగా అనిపించేది..కానీ ఎప్పుడయితే వ్రాయడము మొదలుపెట్టానో.. నాలో ఒక నూతన ఉత్సాహం చిగురించింది... నా జీవితానికి పరమార్ధం గోచరించింది...నా వ్రాతలతో కనీసం ఒక్కరిలోనైనా మార్పు తీసుకురాగలిగితే నా జన్మకు సార్ధకత చేకూరుతుంది...ఇలా ప్రతి ఒక్కరూ తమ జీవితపు లక్ష్యాన్ని తెలుసుకుని ...గమ్యాన్ని చేరుకోవడానికి వాళ్ళు పడే తపనే ఆత్మ సంతృప్తి...అప్పుడు ఈ నిరాశ, నిస్పృహ, నైరాశ్యం ఉండవు...మీకు నిజముగా ఈ జీవితాన్ని ముగించేయ్యాలి అనుకుంటే సమాజం కోసం పాటుపడండి...మీ లాంటి బాధితులను ఆదుకోండి...మీ జీవితాన్ని ఒక గుణపాఠంగా భావించి..మీ అనుభవాలను ఇతరులతో పంచుకోండి...వాళ్ళ జీవితాలలో వెలుగును తీసుకురండి..ఆ వెలుతురు మీకూ ఒక దారి చూపుతుంది. దీనికి అంకురార్పణ మనవైపు నుండే రావాలి...

## అంతర్జాల ఆటలు

నేడు చరవాణికి ఎంత అలవాటు పడ్డారో..అంతకు రెట్టింపుగా ఈ అంతర్జాల ఆటలకు చిన్న పిల్లల నుండి పెద్దవాళ్లవరకు అందరూ బానిసలయిపోయారనే చెప్పాలి..ముఖ్యముగా పిల్లలు. సమయము చిక్కితే చాలు...నాన్న ఫోనో...అమ్మ ఫోనో తీసుకోవడం...తీక్షణముగా ఆటలు ఆడేయడం...ఇది ఒక అలవాటుగా

www.sirimalle.com

మారిపోయింది వాళ్ళకు. ఆ కదిలే బొమ్మల వెంట తమ సున్నితమైన కళ్లను...చక్రాల వలె అతివేగముగా త్రిప్పుతూ...మరొక రెండు కళ్లను [కళ్ల జోడు] అతికించుకుంటున్నారు. నాజూకయిన చేతి వేళ్ళను ఆటకి అనుగుణముగా ఎన్నో ఒంపులు..ఓంకారాలు తిప్పుతూ...నరాల బలహీనతలను కొని తెచ్చుకుంటున్నారు... ఇది అంతా ఒక ఎత్తయితే ఈ మధ్య ఒక అంతర్జాల ఆటకు బానిసగా మారి..ఆరవ..ఏడవ తరగతికి చెందిన ఇద్దరు పిల్లలు ఆత్మహత్య చేసుకునేటట్లుగా ప్రేరేపించిన విషయము నన్ను చాలా కలవర పరిచింది. ఒక ఆట వలన ఇలాంటి పరిస్థితిని ఎదుర్కొంటున్నాము అంటే... అసలు ఎటువైపు పయనిస్తున్నాము మనము? చెడు ఆలోచనలను రేకెత్తించే ఇలాంటి ఆటలు మన పిల్లలు ఆడకుండా ఎందుకు నియంత్రించ లేకపోతున్నాము... అసలు పిల్లలకు ఈ ఆటలాడే అలవాటు ఎలా వచ్చింది? ఎప్పుడైనా ఆలోచించారా? దీనికి కారణం పెద్దలమైన మనమే అంటాను నేను.. పిల్లలు అల్లరి పెట్టకుండా బుద్ధిగా ఉంటారని.. మారాము చేయకుండా భోజనము చేస్తారని..మనకి ఇష్టమయిన కార్యక్రమము టివిలో చూడనిస్తారని.. శుభకార్యాలలో మనకి ఇబ్బంది పెట్టకుండా ఉంటారని ..ఇలా రకరకాల కారణాల వలన మనమే పిల్లలకు ఈ అంతర్జాల ఆటలను అలవాటుచేశాము..అయితే ఇక్కడ మీరు నన్ను ఒక ప్రశ్న వెయ్యవచ్చు! మరి పిల్లలు అల్లరిని కట్టడి చేసేది ఎలా అని? మన చిన్నతనములో ఇలాంటి ఆటలు ఆడే ఎదిగామా? మనము బుద్ధిగా పెరగలేదా? ఒకసారి మనము ఆవైపుగా ఆలోచించాలి! పిల్లలతో నేడు తల్లితండ్రులు ఎంత సమయాన్ని గడుపుతున్నారో..ఎవరికి వాళ్ళు ఆత్మ పరిశీలన చేసుకోవాలి. అపార్ట్మెంటులలో ఎవరికి వాళ్ళు తలుపులు వేసుకుని ఉండే పైఖరిని మానుకుని...అందరి పిల్లలని బయట ఆడుకునేటట్లు ప్రోత్సహించాలి...మనము చిన్నప్పుడు ఆడుకునే ఆటలను వాళ్ళకు నేర్పించాలి.. అవసరమయితే వాళ్ళకు అలవాటయిన వరకు మనము కూడా ఉండి ఆడిపించాలి... ఇది పిల్లలకే కాదు.. ఇంటా బయట ఒత్తిడి తో సతమవుతున్న పెద్దలకు కూడా కొంత ఉపశమనము కలుగుతుంది. మారుతున్న కాలముతో పాటు, జీవన ప్రమాణాల మెరుగుతో పాటు మనమూ మారాలి కాదనను. కానీ ఆ మార్పు పెడదారిన పడకుండా చూడవలసిన బాధ్యత కూడా మనదే కదా! పిల్లలు బయట ఆటలలో ఉండే మాధుర్యము చవిచూసిన తరువాత ఆ ఆటలను విడిచిపెట్టమన్నా విడిచిపెట్టరు.. ఒకసారి మన చిన్నతనాన్ని గుర్తు చేసుకోండి. మన తల్లిదండ్రులు మనల్ని ఆడుతున్నపుడు ఇంటికి రప్పించుకోవడానికి ఎన్ని అవస్థలు పడేవారో! ఇంకా పిల్లలకి మంచి పుస్తకాలు చదివే అలవాటు చెయ్యవచ్చు.. ఇలా ప్రత్యామ్నాయాలు ఎన్నో! మనసుంటే మార్గాలెన్నో ఉన్నాయి...ప్రయత్నించి చూద్దాము.. పోయేదేముంది!

# ఎక్కడికి ఈ పరుగు

మనిషి జీవన పయనంలో ఎన్నో శోధించాడు..ఎంతో సాధించాడు..ఎంతగానో పురోగమించాడు. అయితే ఈ పయనములో, జీవన శైలిలో అనూహ్యమైన మార్పులు చోటు చేసుకున్నాయి. మన పూర్వీకులు (ఇదివరకటి రోజులలో) బ్రతకటానికి సరిపడా సంపాదించుకుని ఉన్నదాంట్లో తృప్తిగా తిని హాయిగా, సంతోషముగా జీవించారు. కానీ నేటి పరిస్థితి ఇందుకు భిన్నముగా ఉంది. విలాసవంతమై సుఖవంతమైన జీవనం గడపడానికి పగలు రాత్రి తేడా లేకుండా కష్టపడుతున్నాము. పిల్లలకి ఖరీదైన చదువులు చదివిస్తున్నాము. వాళ్ళకి ఆస్తులు సంపాదించి పెడుతున్నాము. రేపు వాళ్ళు భవిష్యత్తులో కష్టపడకుండా ఉండడం కోసం మనం కష్టపడుతున్నాము. మా పిల్లలు విదేశాలలో చదువుకుంటున్నారు అని చెప్పుకోవడం కొఱకు ఎన్నో అవస్థలకు గురౌతున్నాము. చివరకు వారి దగ్గరకు వెళ్ళలేక, వెళ్ళినా మాతృభూమి మమకారం వదులుకోలేక మన పిల్లలకి అమ్మానాన్నలని దూరము చేస్తూ ఎక్కడో చదివిస్తూ అర్థంల్లేని జీవనం గడుపుతున్నాము. అమ్మానాన్నలకి మనం దూరముగా ఉంటూ అనుబంధాలు, ఆప్యాయతలను మరచి సంపాదనే ధ్యేయముగా మరమనుషులుగా యాంత్రికమై పోయాయి మన బ్రతుకులు. పెళ్లిళ్లు, విందులు, వినోదాలు అన్నీ తమ పరపతిని చూపుటకై అన్నట్లుగా ఉంటున్నాయి. వేళకి తినక, కంటి నిండా నిద్రపోలేక ఒత్తిడిలతో సతమతమవుతూ అనారోగ్యాలు కోరి తెచ్చుకుంటున్నాము.

అయితే ఎందుకీ పరుగు...ఎక్కడివరకు...దేనికొఱకు..ఎప్పుడయినా ఆలోచించామా! ఉన్నంతలో తృప్తిగా జీవించలేమా?మన అమ్మానాన్నలు సంపాదించిన ఆస్తి తోనే మనం బ్రతుకుతున్నామా? ఈ రోజు మనం సంపాదించినట్లే మన పిల్లలు సంపాదిస్తారు కదా! మరి ఎందుకీ పరుగు?వాళ్ళకి ఆస్తి సంపాదించి ఇచ్చి సోమరిపోతులుగా తయారు చేసే కన్నా, సంపాదించడానికి సరిపడా విద్యాబుద్ధులు నేర్పిస్తే సరిపోతుంది కదా! ఇక పిల్లలకి చదువులు విషయానికి వస్తే ...ఖరీదయిన చదువులయితేనే, హాస్టల్ లలో పెడితేనే చదువు బోధపడుతుందా! సామాన్యమైన చదువు మనం చదవలేదా? స్వతహాగా వాళ్ళని ఎదగనిస్తే ఎన్నో అద్భుతాలు సృష్టిస్తారు నేటి యువత. కానీ ఇరుకైన, ఖరీదయిన కారాగార చదువులు ఎందుకు? ఈ పరుగులు ఎంతవరకు? అన్న ఆలోచనకు అంకురార్పణ మనమే చేయాలి..దీనిని సమస్యగా మనము భావిస్తే.. అందుకు పరిష్కారము మన దగ్గరే ఉంది. అది ఎవరికి వారే తెలుసుకోవాలి.